క్లుప్తంగా

నేడు పట్టణంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

నూజివీడు: పట్టణ పరిధిలోని ట్రిపుల్‌ఐటీ సబ్‌స్టేషన్, టౌన్ సబ్‌స్టేషన్‌లలో మరమ్మతుల నేపథ్యంలో ఆదివారం ఉదయం 9 నుంచి 11 గంటల వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఈఈ సత్యన్నారాయణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

గ్రామ దేవతకు మకరతోరణం

గంపలగూడెం: మండల కేంద్రంలో గ్రామదేవత ముత్యాలమ్మకు అలంకరించేందుకు ఒక భక్తుడు ఇత్తడి మకరతోరణాన్ని శనివారం వితరణగా అందజేశారు. గ్రామానికి చెందిన వనమా మురళి, సుజాత దంపతులు తోరణాన్ని తయారు చేయించి ఆలయ కమిటీ సభ్యులు నరసింహారావుకు అందజేశారు.

ఈవీఎంలపై అవగాహన

విస్సన్నపేట: మండలంలోని పుట్రేల , జానలగడ్డ గ్రామాల్లో ఈవీఎంలపై ఓటు హక్కు వినియోగించుకోవటంపై ఓటర్లకు అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈవీఎం ద్వారా ఓటు హక్కు ఎలా వినియోగించుకోవాలి అనే అంశాలపై ఏఎస్‌ఓ దయానంద్ ఓటర్లకు అవగాహన కల్పించారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి

ఇబ్రహీంపట్నం: రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ఎంపీపీ పాలడుగు జ్యోత్స్న అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధి కమిటీ సమావేశంలో శనివారం ఆమె పాల్గొన్నారు. పీహెచ్‌సీ పరిసరాలు ఆమె పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్య సేవలు, మందులు సరఫరా తదితర అంశాలపై పీహెచ్‌సీ వైద్యాధికారి పర్వీన్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యశ్రీ కార్డులు త్వరగా పంపిణీ చేయాలన్నారు. రెండో విడత జరగనున్న జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపుల విధి విధానాలపై పలు సూచనలు చేశారు. పాలడుగు దుర్గాప్రసాద్, సీహెచ్‌వో నారాయణ, సహాయకులు రవి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వైకుంఠ ఏకాదశి



గంపలగూడెం రామాలయంలో సీతారామచంద్రుల ఉత్తర దర్శన భాగ్యం



వేంకటాచలస్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు



ఆగిరిపల్లిలో ఉత్తర ద్వారంలో దర్శనమిచ్చిన శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీనరసింహ స్వామి



మైలవరం కోదండ రామాలయంలో వెండి కమలాలతో సహస్రనామార్చన

గంపలగూడెం: ముక్కోటి ఏకాదశి పర్వదినోత్సవాన్ని మండలంలో శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో వివిధ వైష్ణవ ఆలయాల్లో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో భక్తులు విశేషంగా పాల్గొన్నారు. గంపలగూడెం, పెనుగొలను రామాలయాల్లో, మెట్టగుట్ట శేషాచల శ్రీనివాసస్వామి ఆలయాల్లో ఉత్తర ద్వారం నుంచి భక్తులు స్వామిని దర్శించుకున్నారు. గంపలగూడెం శివాలయం, షిరిడి సాయిబాబా ధ్యాన నిలయం, మేడూరు శ్రీ వీరాంజనేయస్వామి ఆలయం, గోసవీడు, మధన వేణుగోపాలస్వామి, ఊటుకూరు రామాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. గంపలగూడెంలో సీతారామచంద్రస్వామి ఆలయంలో ఉత్సవమూర్తులను ప్రత్యేక రథంపై అట్టహాసంగా ఊరేగించారు. రథం ముందు మహిళలు నిర్వహించిన కోలాటం ప్రధానం ఆకర్షణగా నిలిచింది. మెట్టగుట్ట శేషాచల శ్రీనివాస స్వామిని శేషవాహనంపై నుంచి గ్రామంలో ఊరేగించారు.

నూజివీడు: ముక్కోటి పర్వదినాన్ని డివిజన్‌లో భక్తులు శనివారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పట్టణంలోని ఆలయాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. తెల్లవారుజామునుంచే ఆలయాల వద్ద భక్తులు పోటెత్తారు. పట్టణంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి కోవెల భక్తులతో పోటెత్తింది. వేంకటాచలస్వామి ఆలయంలో వేంకటేశ్వరస్వామి భక్తులకు ఉత్తరద్వార దర్శనం ద్వారా కనులవిందు చేశారు. ఆలయంలో భక్తులు ప్రత్యేకపూజలు చేశారు. ఈవో భక్తుల సౌకర్యార్థం స్వామి వారిని దర్శించుకునేందుకు రూ.50, రూ.100 టిక్కెట్లను కూడా ఏర్పాటు చేశారు. ముక్కోటి సందర్భంగా పట్టణంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలోని స్వామి వారిని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు శనివారం దర్శించుకున్నారు. సీఐ మూర్తి ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నిర్వహించారు. గొల్లపల్లిలో వేంచేసియున్న శ్రీ రఘునాథస్వామి ఆలయంలో భక్తులు ఉత్తర ద్వార దర్శనం ద్వారా స్వామి వారిని దర్శించుకున్నారు.

ఆగిరిపల్లి: మండలంలోని వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని శనివారం భక్తులు వైభవంగా జరుపుకున్నారు. స్థానిక శోభనాచల వ్యాఘ్ర లక్ష్మి నరసింహ స్వామి దేవస్థానంలో స్వామివారికి ఆలయ అర్చకులు వేదాంతం శేషుబాబు, జి.అనంత కృష్ణ ఆధ్వర్యంలో తెల్లవారుజామున స్వామివారికి విశేష అలంకరణ, పూజలు నిర్వహించారు. స్థానిక విజయవాడ రోడ్‌లో గల కోదండ రామాలయంలో ఉత్తర ద్వారంలో ఉన్న శ్రీరాముడికి అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. అడ్డరోడ్డులోని దాసాంజనేయ స్వామి ఆలయంలో భక్తులకు ఉత్తర ద్వారా దర్శనం ఏర్పాటు చేసి 5 వేల మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామివారి ఉత్తర ద్వారా దర్శనం కల్పించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందచేశారు.

విస్సన్నపేట: ముక్కోటి ఏకాదశి సందర్భంగా మండలంలోని పలు దేవాలయాల్లో ఉత్తర ద్వారం దర్శనం చేసుకొని భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బస్టాండ్‌సెంటర్, పోలీస్‌స్టేషన్ పక్కన ఉన్న రామాలయంతో పాటు పలు దేవాలయాల్లో తెల్లవారుజాము నుంచే ఉత్తర ద్వార దర్శన భాగ్యం, ప్రత్యేక పూజలు చేశారు.

చాట్రాయి: మండలంలోని అన్ని గ్రామాల్లో ముక్కోటి ఏకాదశి పండుగను శనివారం ఘనంగా నిర్వహించారు. చనుబండ శ్రీ కోదండ రామాలయంలో ఉత్తర ద్వార దర్శనం ద్వారా చాట్రాయి, చనుబండ, నరశింహారావుపాలెం, సి గుడిపాడు, ఖమ్మం జిల్లా సరిహద్దు గ్రామాల నుంచి వేలాది మంది భక్తులు తెల్లవారుజాము నుంచి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త పుచ్చకాయల చెన్నకేశవరెడ్డి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

మైలవరం: మండల కేంద్రంలో వేంచేసియున్న ద్వారకా తిరుమల దత్తత దేవాలయం శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఉత్తర ద్వార దర్శనానికి భక్తులు పోటెత్తారు. శనివారం ఉదయం తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయం వద్ద బారులు తీరి దర్శనానికి క్యూలైన్‌లో నిలబడ్డారు. మైలవరంలోని శ్రీకోదండ రామస్వామి దేవస్థానంలో ముక్కోటి ఏకాదశి వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. శ్రీసీతారామస్వామి వారికి వేయి ఎనిమిది వెండి కమలాలతో సహస్ర నామార్చన నిర్వహించారు. విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నెమలి(గంపలగూడెం): జిల్లాలో విశిష్ట దేవాలయంగా ఉన్న గంపలగూడెం మండలం నెమలి శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి పర్వదినోత్సవం సందర్భంగా భక్తులు ఉత్తర ద్వార దర్శనంలో విశేషంగా పాల్గొన్నారు. ఆలయం ప్రధాన అర్చకులు తిరునగరి గోపాలచార్యులు, అర్చక బృందంచే ముందుగా స్వామికి పంచామృతాలతో అభిషేకం చేసి నూతన వస్త్రాలు, వివిధ రకాల పూలదండలు, స్వర్ణా భరణాలతో ప్రత్యేక ఆలంకరణ గావించి విశేష పూజలు చేశారు. ఉత్తర ద్వారం గుండా స్వామిని దర్శించుకునేందుకు భక్తులు తెల్లవారుజామునే క్యూలైన్లలో బారులు తీరారు. సాయంత్రం స్వామి గ్రామోత్సవం వైభవంగా జరిపారు. వేణుగోపాలస్వామిని గరుడ వాహనంపై ఉంచి భాజాభజంత్రీలతో ఊరేగించారు. ఆలయం సహాయ కమిషనర్ దాసరి శ్రీరామ వర ప్రసాదరావు, భక్తులు పాల్గొన్నారు.

తిరువూరు: ముక్కోటి ఏకాదశి పర్వదిన సందర్భంగా తిరువూరు మండలంలో శనివారం దేవాలయాల్లో విశేషపూజలు జరిగాయి. వేంకటాచల స్వామి ఆలయం, శ్రీ రాజ్యలక్ష్మీ సమేత రంగనాయకస్వామి ఆలయం, కోదండ రామాలయాల్లో తెల్లవారుజాము నుంచి ఉత్తర ద్వార దర్శనం చేసుకున్నారు. రాజుపేట, చీరాలసెంటర్, జగన్నాథపురం, పాతతిరువూరులోని రామాలయాలు, ఆంజనేయస్వామి దేవాలయాలు, పీటీకొత్తూరు రామాలయం, వామకుంట్ల, మునుకుళ్ళ, చౌటపల్లి, జీకొత్తూరు, గానుగపాడు, పెద్దవరం, ఎర్రమాడు, కోకిలంపాడు, అక్కపాలెం, కాకర్ల, లక్ష్మీపురం గ్రామాల్లోని పలు ఆలయాల్లో ముక్కోటి పర్వదిన వేడుకలను నిర్వహించారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

చిలుకూరువారిగూడెం(మైలవరం): పదో తరగతి విద్యార్థులు ఈ ఏడాది ఉత్తమ ఫలితాలు సాధించాలని ఏఎంసీ చైర్మన్ అప్పిడి సత్యనారాయణరెడ్డి తెలిపారు. చిలుకూరివారిగూడెం అప్పిడి సుబ్బారెడ్డి జిల్లా పరిషత్ పాఠశాలలో శనివారం పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాలుగా విద్యార్థులు మంచి ఫలితాలు సాధిస్తున్నారని చెప్పారు.

జి.కొండూరు: పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడమే లక్ష్యంగా జిల్లా పరిషత్ చైర్మన్ ఉప్పాల హారిక అందించిన స్ఫూర్తి స్టడీ మెటీరియల్‌ను విద్యార్థులు సద్వినియోగపరుచుకోవాలని ఎంపీటీసీ సభ్యుడు పిల్లి ప్రసాద్ అన్నారు. మండల పరిధి గంగినేని జెడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను ఆయన శుక్రవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జివి రామకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాడి రైతులకు బోనస్

రెడ్డిగూడెం: పాడి రైతు సంక్షేమం మన మతం అలు పెరగని సేవ మన అభిమతం కార్యక్రమంలో భాగంగా మండలంలోని నరుకుళ్ళపాడు, తోలుకోడు గ్రామాలను కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తోలుకోడులో రెండో విడతగా బోనస్‌ను రూ. 36,840, సంఘ బోనస్‌ను రూ. 21,900 పంపిణీ చేశామన్నారు. నరుకుళ్ళపాడులో రెండో విడత బోనస్‌ను రూ.69,690 అందించామని తెలిపారు. బోర్డు డైరెక్టర్ ఉయ్యూరు అంజిరెడ్డి, మైలవరం క్లస్టర్ మేనేజర్ తుమ్మల యశ్వంత్, తొలుకోడు ప్రెసిడెంట్ జి. నిర్మల, నరుకుళ్ళపాడు ప్రెసిడెంట్ కె.శ్యాం సుందరరావు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నంలో ర్యాలీ

ఇబ్రహీంపట్నం: ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్ర క్రీడలను యువకులు, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ పాలడుగు జ్యోత్స్న అన్నారు. విద్యార్థులు నిర్వహించిన ర్యాలీలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్ర ఆటలతో గ్రామీణ క్రీడాకారుల ప్రతిభ బయటకు వస్తుందని స్పష్టం చేశారు.

దుప్పట్లు పంపిణీ

ఏ.కొండూరు: మండలంలోని రామచంద్రాపురం గ్రామంలో శనివారం హోప్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో దివ్యాంగులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హోప్ సంస్థ డైరెక్టర్ ఫణీంద్ర శ్రీనివాస్ మాట్లాడుతూ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఫౌండర్ బి. విశ్వ భారతి, ఉపాధ్యక్షుడు కె.లక్ష్మణరావు పాల్గొన్నారు.

క్రీడాకారులను వెలికితీసేందుకే ఆడుదాం ఆంధ్రా

ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు



నూజివీడులో 3కే రన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు

నూజివీడు: క్రీడలను ప్రోత్సహించడంతో పాటు ప్రతిభ కలిగిన క్రీడా ఆణిముత్యాలను వెలికితీయడానికి రాష్ట్ర ప్రభుత్వం 'ఆడుదాం ఆంధ్రా' క్రీడా సంబరానికి శ్రీకారం చుట్టిందని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. ఈ నెల 26 నుంచి ప్రారంభమయ్యే ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా శనివారం పట్టణంలో సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 3కే రన్ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే మేకా ప్రతాప్ ప్రారంభించారు. 3కే రన్‌ను సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద నుంచి పీజీ సెంటర్, చిన్నగాంధీబొమ్మ సెంటర్ మీదుగా రాజీవ్ సర్కిల్ వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడల ద్వారా ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించడంతో పాటు క్రీడా నైపుణ్యాన్ని వెలికితీయడం జరుగుతుందన్నారు. క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్, టెన్నీకాయిట్ తదితర పోటీలను గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు నిర్వహిస్తోందన్నారు. పురుషుల 3కే రన్‌లో నూజివీడు పట్టణానికి చెందిన తాడేపల్లి సంజయ్, లౌకరియా అర్జున్, లౌకరియా ఆకాష్ ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. మహిళల విభాగంలో షేక్ ఆస్రా, బేతాళ ప్రభుదీపిక, బుర్రి ప్రణవి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. వీరికి ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు, సబ్‌కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, అసిస్టెంట్ కలెక్టర్ శ్రీపూజ చేతుల మీదుగా నగదు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో డీఎస్పీ ఈడే అశోక్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ సయ్యద్ అబ్దుల్ రషీద్, తహసీల్దార్ డీవీఎస్ యల్లారావు, డీఎల్‌డీవో వెంకటరత్నం, డీవైఈవో ఎం సెవియా, ఎంపీడీవో వీఏ విజయ్‌కుమార్, మున్సిపల్ వైస్ చైర్మన్‌లు పగడాల సత్యన్నారాయణ, కొమ్ము వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు శీలం రాము, పీడీలు వాకా నాగరాజు, పీ రవీంద్ర, లక్ష్మీ, వాకా వనజ తదితరులు పాల్గొన్నారు.

చాట్రాయి: క్రీడాకారులను ప్రోత్సహించేందుకు క్రీడలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు స్పష్టం చేశారు. శనివారం చాట్రాయి జెడ్పీ హైస్కూల్లో నిర్వహించిన ఆడుదాం ఆంధ్రా ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఏపీ కో ఆపరేటివ్ యూనియన్ రాష్ట్ర చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు దామెర ప్రసాదుబాబు, చెలికాని బాబ్జీ, ఎంపీడీవో దుర్గాప్రసాదు, తహసీల్దార్ విశ్వనాథరావు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత చదువుల్లో రాణించాలి



ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు

చాట్రాయి: పేద విద్యార్థులు ఉన్నత చదువుల్లో రాణించడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగంలో విప్లవాత్మకమైన మార్పులు చేపట్టారని నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు తెలిపారు. చాట్రాయి జెడ్పీ హైస్కూల్లో 8వ తరగతి విద్యార్థులకు శనివారం ట్యాబ్‌లు పంపిణీ చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పేద విద్యార్థులకు ఇంగ్లిషు మీడియంలో విద్యాబోధన అందించి వారిని ఐఏఎస్, ఐపీఎస్, ఇంజినీరింగ్, సాఫ్ట్‌వేర్ లాంటి ఉద్యోగాలు పొందడానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యావ్యవస్థను బలోపేతం చేస్తున్నారని చెప్పారు. అనంతరం 294 మంది విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఏపీ కో ఆపరేటివ్ యూనియన్ రాష్ట్ర చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి, గ్రామ సర్పంచ్ దామెర ఉషా, ఎంపీపీ లంకా నిర్మల, వైఎస్సార్ సీపీ నాయకులు చెలికాని బాబ్జీ, కారంగుల వాసు, దామెర ప్రసాదుబాబు, పామర్తి నాగేశ్వరరావు, పరసా చెన్నారావు, ఎంపీడీవో దుర్గా ప్రసాదు, తహసీల్దార్ విశ్వనాధరావు ఎంఈవోలు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి: ఆగిరిపల్లిలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు ఎమ్మెల్యే ట్యాబ్‌లు పంపిణీ చేశారు. జెడ్పీటీసీ పిన్నిబోయిన వీరబాబు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పల్లగాని నరసింహారావు, జిల్లా కార్యదర్శి మచ్చా హరిబాబు, జిల్లా ఉపాధ్యక్షురాలు సుజన కుమారి, పంచాయతీరాజ్ ఉపాధ్యక్షులు రాఘవరావు సురేష్, ఎంపీడీవో శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

అన్ని కుటుంబాల సంక్షేమమే లక్ష్యం

ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు



నూజివీడు: రాష్ట్రంలోని ప్రతి పేద కుటుంబం సంతోషంగా ఉండాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం గడప గడపకు సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. పట్టణంలోని 9, 10 వార్డుల్లో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే ప్రతాప్ ఇంటింటికి పర్యటించి వైఎస్ జగన్ నాలుగున్నరేళ్ల పాలనలో ఏయే సంక్షేమ పథకాల కింద ఎంతెంత లబ్ధిపొందారో ఆయా కుటుంబాల వారికి వివరించారు. ప్రతి వార్డుకు రూ.12 కోట్ల నుంచి రూ.18కోట్ల వరకు లబ్ధి చేకూరిందన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్‌లు సత్యన్నారాయణ, వెంకటేశ్వరరావు, పట్టణ అధ్యక్షుడు శీలం రాము, కౌన్సిలర్లు మీర్ అంజాద్ ఆలీ, బాణావతు రంగారావు, మున్సిపల్ కమిషనర్ సయ్యద్ అబ్దుల్ రషీద్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీటీపీఎస్‌లో సెమీ క్రిస్మస్ వేడుకలు



ఇబ్రహీంపట్నం: ఎన్టీటీపీఎస్‌లో సెమీ క్రిస్మస్ వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. అంతర్జాతీయ సువార్తీకులు బిషప్ రెవరెండ్ యల్లమెల్లి రాజేంద్ర కుమార్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చీఫ్ ఇంజినీర్ ముఖ్య అతిథిగా పాల్గొని కేక్ కట్‌చేశారు. క్రిస్టియన్ పవర్ ఎంప్లాయీస్ యూనియన్ నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించారు. ఎస్‌ఈలు సీహెచ్‌వీ రమణ మూర్తి, ప్రసాద్, అనూరాధ, ఏడీఈ ఉమా విజయ్‌చంద్ పాల్గొన్నారు. సెయింట్ జేవియర్ పాఠశాలలో సెమీ క్రిస్మస్ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ టి.ప్రవీణ కేక్ కట్‌చేశారు.

జి.కొండూరు: స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఏఓ రాంకుమార్ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు.

ఆగిరిపల్లి: సమాజంలో ప్రతి మానవుడు సేవా గుణంతో మెలగాలని నూజివీడు డీఎస్పీ అశోక్ కుమార్ గౌడ్ అన్నారు. ఆగిరిపల్లిలో ఎస్సై చంటి బాబు ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ నిర్వహించారు.

కేసులు ఎత్తివేయడం హర్షణీయం

ఆగిరిపల్లి: చంద్రబాబు ప్రభుత్వంలో అక్రమంగా ఎస్సీలపై పెట్టిన కేసులు ఎత్తివేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జీవో జారీ చేయడం హర్షణీయమని మాదిగ రాజకీయ పోరాట సమితి జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు కంబాల ప్రదీప్ పేర్కొన్నారు. ఆయన శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వ హయాంలో మాదిగ దండోరా, ఎమ్మార్పీఎస్ ఉద్యమంలోనూ, కురుక్షేత్ర మహాసభ, అసెంబ్లీ ముట్టడి, మాలమహానాడు నాయకులు మీద అన్యాయంగా పెట్టిన కేసులు ఎత్తివేస్తూ తీసుకున్న నిర్ణయం సాహసోపేతమన్నారు.

ప్రభుత్వ సేవలు ప్రజలకు మరింత చేరువ



విస్సన్నపేట: ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకే గ్రామ సచివాలయాలు ఏర్పాటు చేశామని ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి అన్నారు. విస్సన్నపేటలో నూతనంగా నిర్మించిన 2,4వ గ్రామ సచివాలయం భవనాలను ఎమ్మెల్యే శనివారం రిబ్బన్‌కట్ చేసి ప్రారంబించారు. గ్రామాల్లో ప్రజలకు ప్రభుత్వ సేవలను ఆయా గ్రామ సచివాలయాల వద్దే అందిస్తామని తెలిపారు. ఎంపీడీఓ ఎస్.వెంకటరమణ, తహసీల్దార్ చంద్రశేఖర్, పీఆర్‌డీఈ చక్రవర్తి, ఎంపీపీ పిల్లి మెర్సీవనజాక్షి, విస్సన్నపేట, తిరువూరు జెడ్పీటీసీ సభ్యులు భీమిరెడ్డి లోకేశ్వరరెడ్డి, యరమల రామచంద్రారెడ్డి, సర్పంచ్ సాధుపాటి నాగమల్లేశ్వరి, కేడీసీసీబీ డైరెక్టర్ భూక్యా రాణి, వైస్ఎంపీపీ రెడ్డి శ్రీనివాసరావు, మాజీ వైస్ ఎంపీపీ ఓలేటి దుర్గారావు, ఉపసర్పంచ్ సత్యనారాయణరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ అనుమోలు శివబాజీ, పట్టణ అధ్యక్షుడు నెక్కళపు కుటుంబరావు, వివిధ గ్రామాల సర్పంచులు, పార్టీనాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్

ఏ.కొండూరు: మండలంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో గణిత శాస్త్ర పితామహుడు రామానుజన్ జయంతి సందర్భంగా శనివారం జగనన్న స్ఫూర్తి స్టడీ మెటీరియల్ పదవతరగతి విద్యార్థులకు ప్రిన్సిపాల్ మీరునిస్సా బేగం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ స్టడీ మెటీరియల్ విద్యార్థులు చదివి నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు.